క్లుప్తంగా

రెవెన్యూ పరమైన సమస్యలకు స్వస్తి



ఆరికరేవులలో ర్యాలీ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బిక్కవోలు: రెవెన్యూ రికార్డుల్లో సాంకేతిక సమస్యలకు స్వస్తి పలికేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కృష్ణ తెలిపారు. సోమవారం ఆరికరేవుల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఎనిమిది దరఖాస్తులు వచ్చాయి. అనంతరం ప్రజలకు సదస్సులపై అవగాహన కల్పించడానికి ర్యాలీ చేపట్టారు.

27న మండల సమావేశం

రాజానగరం: స్థానిక మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 27న జరగనుందని ఎంపీడీఓ జేపీ ఝాన్సీ తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటల నుంచి ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సమావేశంలో మండలానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు సంపూర్ణ వివరాలతో హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



బలభద్రపురంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. గ్రామంలోని ఎంపీటీసీ సభ్యుడు మేడపాటి ఆనందరెడ్డి, గంగాభవానీల కుమారుడు నాగ సుధీర్ 25వ జయంతి సందర్భంగా పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. గ్రామంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి నల్లమిల్లి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రెడ్డి పంతులు సత్రం షాపునకు పెరిగిన అద్దె



వేలం నిర్వహిస్తున్న అధికారులు

మధురపూడి: కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం రోడ్డులోని విరియాల వెంకటరెడ్డి పంతులు సత్రం షాపునకు అద్దె పెరిగింది. ఆ సత్రం వద్ద సోమవారం నిర్వహించిన బహిరంగ వేలంలో ఒకటో నంబరు షాపును నెలకు రూ.14,500 పాడుకున్నారు. గతంలో దీని అద్దె కేవలం రూ.4 వేలు మాత్రమే ఉండేది. దేవదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ టీవీఎస్ ప్రసాద్, సత్రం ఈఓ జీవీఎల్ లక్ష్మీకుమార్ ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వేలం నిర్వహించారు. కామిశెట్టి దొరబాబు రూ.14,500కు షాపును దక్కించుకున్నారు. కార్యక్రమంలో సత్రం గుమస్తా వి.సూరిబాబు, స్థానిక నాయకులు కర్రి గణేష్, బదిరెడ్డి దొర తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

సీతానగరం: కాటవరం శివారున పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ సోమవారం తెలిపారు. వారి నుంచి రూ.8,660 స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలి



వంశీకృష్ణను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

సీతానగరం: విజయవాడలో జనవరి ఐదో తేదీన నిర్వహించే హైందవ శంఖారావం మహాసభను జయప్రదం చేయాలని బీజేపీ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ కోరారు. ఆయన సోమవారం సీతానగరం విచ్చేసి మహాసభకు సంబంధించి స్థానిక నాయకులతో చర్చించారు. ఆయనతో జిల్లా అధ్యక్షుడు కందికొండ రమేష్ ఉన్నారు. అనంతరం వంశీకృష్ణను జిల్లా ప్రధాన కార్యదర్శి ఖండవల్లి సాయి, మండల ఓబీసీ అధ్యక్షుడు దాసరి సుబ్బారావు తదితరులు ఘనంగా సన్మానించారు.

పదికి ప్రత్యేక బోధన

- ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతుల నిర్వహణ
- శతశాతం ఉత్తీర్ణతకు వంద రోజుల ప్రణాళిక
- వెనుకబడిన విద్యార్థులపై దృష్టి



రంగంపేట హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

రంగంపేట: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పదో తరగతి కీలకం. ఉన్నత చదువులకు పునాది రాయిగా భావించే పదో తరగతి పరీక్షల పట్ల అటు ఉపాధ్యాయులు, ఇటు తల్లిదండ్రులు అమిత ప్రాధాన్యం ఇవ్వటం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక చేపట్టింది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేయడంతో రెండో శని, ఆదివారాల్లో సైతం అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. డిసెంబరు 1వ తేదీ నుంచి దీన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు మిగిలిన విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా దృష్టి సారిస్తున్నారు. విద్యార్థులు అభ్యసన స్థాయి పెరగడంతో పాటు వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించడానికి ఈ ప్రణాళిక దోహద పడుతుందని విద్యాశాఖ వర్గాలు భావిస్తున్నాయి.

అనపర్తి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే ఏడాది జరగనున్న పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో డిసెంబరు నెల నుంచి మార్చి వరకు వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆయా సబ్జెక్టుల టీచర్లు విద్యార్థులకు ప్రత్యేక సూచనలు ఇస్తున్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షల తేదీలు ఖరారయ్యాయి. వచ్చే ఏడాది మార్చి 17 నుంచి 31 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇటీవల విడుదల చేశారు. అనపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాలైన అనపర్తి, పెదపూడి, బిక్కవోలు, రంగంపేటల్లో 52 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 2,796 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. గతంలో వచ్చిన ఫలితాలను బేరీజు వేసుకొని మరింత మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టు వారీగా విద్యార్థులకు అసైన్‌మెంట్స్ నిర్వహిస్తున్నారు.

అనపర్తి నియోజకవర్గంలో ఉన్నత పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలల సంఖ్య	బాలురు	బాలికలు	మొత్తం
అనపర్తి	18	468	363	831
పెదపూడి	14	403	382	785
బిక్కవోలు	10	297	310	607
రంగంపేట	10	284	289	573
మొత్తం	52	1452	1344	2796

అదనపు తరగతులతో మేలు

వంద రోజుల ప్రణాళికలో భాగంగా రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఒక సబ్జెక్టు, సాయంత్రం మరో సబ్జెక్టు చదివిస్తున్నారు. సెలవు రోజుల్లో సైతం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి వారిలో ఆత్మవిశ్వాసం నింపేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి చేస్తున్నాం. విద్యాశాఖ అందించిన వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తూనే సెలవు దినాల్లోనూ అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా వెనుకబడిన వారిని ప్రత్యేక శ్రద్ధతో చదివిస్తున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారు పాఠశాలల్లో ఉంటున్నందున అల్పాహారం అందించడానికి దాతలు స్పందించాలని కోరుతున్నాం.

– వి. పార్థసారథి, హెచ్ఎం, రంగంపేట ఉన్నత పాఠశాల

స్టడీ అవర్స్‌తో ఉపయోగం



ఉదయం, సాయంత్రం పూట నిర్వహించే స్టడీ అవర్స్ ఉపయోగకరంగా ఉన్నాయి. ప్రతి అంశాన్ని ఉపాధ్యాయుల నుంచి నేర్చుకుంటున్నాం. మా అభ్యున్నతికి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. స్టడీ అవర్స్ ఉపయుక్తంగా ఉన్నాయి. మంచి మార్కులు తెచ్చుకొని పాఠశాలకు గుర్తింపు తీసుకువస్తాం.

– కొండేపూడి జోషిబాబు, పదో తరగతి విద్యార్థి, జెడ్పీ ఉన్నత పాఠశాల, రంగంపేట

ప్రణాళికతో బోధన



పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళిక ప్రకారం మాకు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో బాగుంది. ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

– తానేటి సూర్య ప్రసన్న, పదో తరగతి విద్యార్థిని, జెడ్పీ ఉన్నత పాఠశాల, రంగంపేట



తొస్సిపూడిలో మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహంపై ముసుగు తొలగింపు

ముసుగులు తొలగాయి..!

బిక్కవోలు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసి పది రోజులు కావస్తున్నా ఇంతవరకు నాయకుల విగ్రహాలపై వేసిన ముసుగులు తొలగించని వైనంపై 'తొలగింపునకు తీరిక లేదా..?' శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులను సోమవారం తొలగించారు.

సాక్షి ఇంపాక్ట్



కొమరిపాలెంలో ఇందిరా గాంధీ విగ్రహానికి తొలగించిన ముసుగు

దంత సంరక్షణతో రోగాలు దూరం



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ఎంపీ పురందేశ్వరి

రాజానగరం: దంత సంరక్షణతో అనేక రోగాలకు దూరంగా ఉండవచ్చని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. స్థానిక జీఎస్ఎల్ దంత వైద్య కళాశాలలో సోమవారం జరిగిన 7వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఆధునిక సమాజంలో దంత వైద్యం బాగా ప్రాచుర్యం పొందుతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ వైద్యుడని దేవుడితో సమానంగా ప్రజలు భావిస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా వైద్యసేవలు అందించాలన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ మెరుగైన సేవలతో ప్రజల నమ్మకం పొందాలన్నారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ చీఫ్ మెంటర్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ఎండీ డాక్టర్ గన్ని సందీప్, డైరెక్టర్ డాక్టర్ తరుణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ గంటా సునీల్, సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి, ఎన్ఈఓ సీఈఓ డాక్టర్ బి.వరుణ్ కృష్ణంరాజు, డాక్టర్ దివ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కేఎల్ఎస్ లెనోరా దంత వైద్య కళాశాలలోను సోమవారం రాత్రి గ్రాడ్యుయేషన్ డే జరిగింది. డీసీఐ అధ్యక్షుడు డాక్టర్ సతీష్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



మ్యాచింగ్ ఫజిల్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మధురపూడి: విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని సరస్వతి విద్యానికేతన్ కరస్పాండెంట్ పెనకటి గంగాధర్ అన్నారు. ఆ స్కూల్లో సోమవారం రామానుజన్ ప్రతిభ అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన మ్యాచింగ్ ఫజిల్, డే ఫైండర్ ఆకర్షణీయంగా నిలిచాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



జంబూపట్నంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుస్వాగతం

మధురపూడి: భూమి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్న లక్ష్యంతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు కోరుకొండ తహసీల్దార్ సుస్వాగతం అన్నారు. కోరుకొండ మండలం జంబూపట్నంలోని సచివాలయం వద్ద సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పది సమస్యలపై అర్జీలు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ మల్లికార్జునరావు, ఆర్ఐ రామిరెడ్డి, వీఆర్వో కుంచే శ్రీనివాసరావు, సూర్యకుమార్ పాల్గొన్నారు.

సింగవరంలో..

సీతానగరం: సింగవరం సచివాలయంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు తొమ్మిది అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రైతులు భూసమస్యలపై పలు అర్జీలు అందించారు. కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లకు ఆరు, భూమిని రీసర్వే చేయాలని మూడు అర్జీలు అందాయి. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మూర్తి, ఆర్ఐ నవీన్, సర్వేయర్ గౌతమ్, వీఆర్వో ఇందుగుమిల్లి గంగరాజు, వీఆర్ఏ నాని పాల్గొన్నారు.

సమస్యలపై మూడు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు అందాయి. డ్రైనేజీ, అడంగళ్ నంబరు, విద్యుత్ తీగల సమస్యలపై ఫిర్యాదులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.భారతి, ఈవోపీఆర్డీ మూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం

- ముస్తాబైన చర్చిలు
- నేటి అర్ధరాత్రి నుంచి ప్రార్థనలు



విద్యుద్దీపాలతో మెరిసిపోతున్న చర్చి

మధురపూడి: క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవులు సర్వం సిద్ధం చేసుకున్నారు. దీనిలో భాగంగా గ్రామాల్లో చర్చిలు విద్యుద్దీపాలంకరణతో ముస్తాబయ్యాయి. కోరుకొండ మండలంలోని వివిధ చర్చిల్లో క్రిస్మస్ ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ ట్రీ, స్టార్లు ఏర్పాటు చేశారు. చర్చిలతో పాటు ప్రధాన కూడళ్లు, క్రైస్తవుల నివాస ప్రాంతాలు విద్యుద్దీపాల వెలుగులతో కళకళలాడుతున్నాయి. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ మాణిక్యం ఆధ్వర్యంలో రాత్రంతా జాగరణతో క్రీస్తుకు భూమిపైకి ఆహ్వానం పలుకుతూ ప్రార్థనలు చేస్తారు. పశ్చిమ గానుగూడెంలోని పురాతన సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో పాస్టర్ కృపావిల్సన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరగనున్నాయి. కోరుకొండ, గాడాల, బూరుగుపూడి, దోసకాయలపల్లి, కోటికేశవరం, రాఘవపురం గ్రామాల్లోని లూథరన్, పెంతుకోస్తు మిషనరీలకు చెందిన క్రైస్తవులు క్రిస్మస్ పండగను ఘనంగా నిర్వహించుకోనున్నారు.

వైభవంగా కాలభైరవ స్వామి ఉత్సవాలు

రాజానగరం: తూర్పుగానుగూడెంలోని లక్ష్మీ కుబేర స్వర్ణాకర్షణ కాలభైరవ స్వామి జయంతి ఉత్సవాలు సోమవారంతో వైభవంగా ముగిశాయి. ఆలయ కమిటీ సభ్యుడు గళ్లా రామసత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో 19 నుంచి ఐదు రోజుల పాటు ఈ కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు శివపార్వతుల కల్యాణ ఘట్టానికి సంబంధించిన రూపకాన్ని పరిసర గ్రామాలలో ప్రదర్శించారు.

వ్యవసాయ పథకాలను వినియోగించుకోవాలి



అభ్యుదయ రైతును సన్మానిస్తున్న కేవీకే అధికారులు

రాజానగరం: వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను, శాస్త్రవేత్తలు అందిస్తున్న విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేవీకే ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు పంటలో నిష్ణాతులైన కలవచర్లకు చెందిన చల్లా నాగన్న అనే అభ్యుదయ రైతును సన్మానించారు. అనంతరం నువ్వుల పంట సాగుపై శిక్షణ ఇచ్చి, నువ్వులను పంపిణీ చేశారు. విలువ ఆధారాల తయారీపై చేపల నుంచి అప్పడాలను, ఇతర అల్పాహార వంటకాలను తయారు చేసే పద్ధులపై సంజయ్ వినాయక్ హెగ్డే (గృహ విజ్ఞానం), డాక్టర్ రవీంద్ర సొంటెక్కే (చేపల విభాగం) శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యాన పంటల అధికారి జీవీఆర్ సత్యవాణి, కేవీకే అధికారులు డాక్టర్ బి.నాగేశ్వరరెడ్డి, రఘునందన్, జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన 70 మంది రైతులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలుకు చెందిన కందుల శిరీష అనే మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. శిరీష భర్తతో గొడవల నేపథ్యంలో తల్లి వద్ద ఉంటుందన్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు. ఎప్పటి లాగే ఈ నెల 21న గ్రామంలోని తన పిల్లలు చదివే పాఠశాలకు క్యారేజ్ తీసుకుని వెళ్లిందన్నారు. ఆ తరువాత ఇంటికి రాకపోవడంతో ఆమె తల్లి భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రెండు గ్రామాల్లో నేడు రెవెన్యూ సదస్సులు

పెదపూడి: కరకుదురు, సంపర గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఆర్ఐ చిట్టితల్లి తెలిపారు. రైతులు వారి భూ సమస్యలకు సంబంధించి అర్జీలు అందించి పరిష్కారం పొందాలన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి

మధురపూడి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై పార్లమెంటులో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా తక్షణమే క్షమాపణలు చెప్పాలని గుమ్ములూరు సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నక్కా రాంబాబు డిమాండ్ చేశారు. కోరుకొండ మండలం గుమ్ములూరులోని అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం నిరసన తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

రాజమహేంద్రవరం రూరల్: లారీ ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం పిడింగొయ్యి గ్రామానికి చెందిన ఎల్.నరేష్ (20), తన తల్లి సత్యవతిని తీసుకుని సోమవారం ఉదయం 11.30 సమయంలో మోరంపూడి జంక్షన్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడాకు మోటర్ బైక్‌పై బయలుదేరాడు. కవలగొయ్యి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపైకి వచ్చేసరికి లారీ అతి వేగంగా వచ్చి వారిని ఢీకొంది. కిందపడిపోయిన నరేష్ మీద నుంచి లారీ చక్రాలు వెళ్లిపోయాయి. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

నేటి నుంచి బలభద్రపురంలో

శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం

బిక్కవోలు: తూర్పు తిరుమలేశునిగా పేరు గాంచిన బలభద్రపురం శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి సోమవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం 4.35 గంటలకు బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. నేటి నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు 10 రోజులు కొనసాగుతాయన్నారు. ప్రతి రోజు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుప్రభాత సేవ, తోమాల సేవ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామిసేవలో తరలించాలని కోరారు.

నిర్ణీత వ్యవధిలో వరినాట్లు పూర్తి చేయాలి

పెదపూడి: రబీ సీజన్‌కు సంబంధించి రైతులు వరి నాట్లను జనవరి5 నాటికి పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. పెదపూడి, దోమాడ గ్రామాల్లో సోమవారం వెదసాగు చేసిన పొలాలను ఆయన పరిశీలించారు. రైతులకు వెద సాగు విధానంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 31న పంట కాలువలను ప్రభుత్వం మూసి వేయనున్న నేపథ్యంలో రైతులు త్వరగా వరినాట్లు పూర్తి చేయాలన్నారు. రబీలో సాగు చేసే వరి వంగడాలపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సకాలంలో వరినాట్లు పూర్తి చేయాలని అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలి



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రంగంపేట: విద్యార్థులు గణిత శాస్త్రంపై పట్టు సాధించాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి అన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా సోమవారం పాఠశాలలో గణిత శాస్త్రవేత్త రామానుజన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. లెక్కలు అంటే భయాన్ని తొలగించుకోవాలని, ఉపాధ్యాయులు సూచించిన మెళకువలు పాటించాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన రంగోలి, చిత్రలేఖనం, ఎక్కాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఆధునిక వ్యవసాయంపై

అవగాహన పెంచుకోండి

- నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భరతలక్ష్మి
- వడిశలేరులో రైతు సదస్సు
- వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



వడిశలేరులో రైతు సదస్సును ప్రారంభిస్తున్న డీన్ భరత్‌లక్ష్మి, వ్యవసాయ అధికారి మాధవరావు



నైరా విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న డీన్ భరత్‌లక్ష్మి

రంగంపేట: ఆధునిక వ్యవసాయ విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.భరతలక్ష్మి సూచించారు. సోమవారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రంగంపేట మండలం, వడిశలేరు గ్రామంలో రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం మరియు శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సుకు ఆమె అధ్యక్షత వహించి ప్రసంగించారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరమన్నారు. యాంత్రీకరణ, నూతన వంగడాలు, లాభదాయకమైన సేద్యం, మార్కెటింగ్‌లో పరిజ్ఞానం తప్పనిసరిగా పెంచుకోవాలన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వ్యవసాయ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుని నాణ్యమైన దిగుబడులు సాధించడానికి కృషి చేయాలని రైతులను కోరారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్‌వి నరసింహారావు, మానుకొండ శ్రీనివాస్, డాక్టర్ వి.సుధీర్‌కుమార్, ఏడీఏ కృష్ణ తదితరులు సదస్సులో ప్రసంగించారు. రైతు దినోత్సవం సందర్భంగా పలువురు అభ్యుదయ రైతులను వ్యవసాయశాఖ అధికారులు సత్కరించారు. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి, అభ్యుదయ రైతులు, కోరమండల్ కంపెనీ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.మోహన్‌కుమార్, వ్యవసాయ సహాయకులు మహేష్, లీలా ప్రసాద్, నైరా విద్యార్థులు పాల్గొన్నారు.